సాక్షి
ములుగు

శనివారం | 4 | జనవరి | 2025



శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి

శాంతిభద్రతల పర్యవేక్షణ బాధ్యత స్పెషల్ పోలీసులపై ఉందని రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్ డాక్టర్ తరుణ్‌జోషి గుర్తుచేశారు. - 10లో▸



చిన్న కాళేశ్వరం మోటార్లకు టెస్ట్ రన్

చిన్న కాళేశ్వరం మోటార్ల టెస్ట్ రన్‌ను ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
29^0/16^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉన్నప్పటికీ చల్లగానే ఉంటుంది. రాత్రి సమయంలో పొగ మంచు కురిసి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన తహసీల్దార్



వాజేడు: వాజేడు తహసీల్దార్‌గా శ్రీనివాస్ శుక్రవారం విధుల్లో చేరారు. ములుగు కలెక్టరేట్‌లో పని చేసిన ఆయన శుక్రవారం వాజేడుకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన వీరభద్ర ప్రసాద్ డిసెంబర్ 31న పదవీ విరమణ పొందారు. దీంతో వెంకటాపురం తహసీల్దార్ లక్ష్మీరాజయ్యకు తాత్కాలికంగా బాధ్యతలను అప్పగించారు. శుక్రవారం ఆయన నుంచి శ్రీనివాస్ బాధ్యతలను తీసుకున్నారు. శ్రీనివాస్‌కు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన రేష్మ



వెంకటాపురం(ఎం): జార్ఖండ్‌లో ఈనెల 4 నుంచి 6వ తేదీవరకు నిర్వహించే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండల కేంద్రంలోని మైనార్టీ కళాశాలకు చెందిన ఎస్‌కె.రేష్మ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వందన, పీడీ నవ్య శుక్రవారం తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్‌ఐ అథ్లెటిక్స్ 15,00 మీటర్ల రన్నింగ్ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ నుంచి రేష్మ పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రేష్మను కళాశాల అధ్యాపక బృందం ఆధ్వర్యంలో అభినందించారు.

క్రీడాకారులను అభినందించిన జీఎం



భూపాలపల్లి అర్బన్: ఇటీవల కోలిండియా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన సింగరేణి క్రీడాకారులను శుక్రవారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఎస్ఈసీఎల్ బిలస్పూర్‌లో జరిగిన బాడ్మింటన్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించిన శంకర్, ఓదెలను సన్మానించి అభినందించారు. ఎస్‌వోటు జీఎం కవీంద్ర, అధికార ప్రతినిధి మారుతి, స్పోర్ట్స్, శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి క్యాంటీన్ తనిఖీ



భూపాలపల్లి అర్బన్: ఏరియాలోని కేటీకే 6వ గనిలోని సింగరేణి క్యాంటీన్‌ను ఏరియా ఎస్‌వోటు జీఎం కవీంద్ర శుక్రవారం తనిఖీ చేశారు. క్యాంటీన్‌లోని పూరీలను రుచిచూశారు. కార్మికులకు నాణ్యమైన టిఫిన్లు అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి మారుతి, గని మేనేజర్ మోహన్, కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాస్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

కాటారం: మహాముత్తారం మండలంలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎల్.ప్రసాద్ సస్పెన్షన్‌కు గురయ్యారు. కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్ శుక్రవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీచేశారు. మహాముత్తారం మండలం దౌతుపల్లికి చెందిన పలువురి వద్ద ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పేరిట టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ ఇటీవల రూ.500 చొప్పున సుమారు రూ.5వేలు వసూళ్లకు పాల్పడ్డారు. దీంతో బాధితులు గతనెల 31న మహాముత్తారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఎంపీడీఓ ఫిర్యాదు అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించారు. కలెక్టర్ ఆదేశాలతో డీఆర్‌డీఓ, ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. విధులకు సంబంధించిన రికార్డులు, డిపార్ట్‌మెంట్ సిమ్‌కార్డు ఎంపీడీఓకు అప్పగించడంతోపాటు విచారణ పూర్తయ్యేంత వరకు మండల కేంద్రాన్ని వదిలివెళ్లొద్దని టీఏ ప్రసాద్‌ను ఆదేశించారు.

ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ

భూపాలపల్లి అర్బన్: ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా యోగా విభాగంలో ప్రతిభ కనబర్చినట్లు డీవైఎస్‌ఓ రఘు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యోగా విభాగంలో పొడెం పూజ గోల్డ్ మెడల్, రెస్లింగ్‌లో సహస్ర, బాక్సింగ్‌లో కమల్‌నాథ్, కిక్ బాక్సింగ్‌లో చార్మి, వెయింట్ లిఫ్టింగ్‌లో మనోజ్, వూషూలో శైలజ, మనోజ్‌లు క్యాంస పతకాలు సాధించినట్లు తెలిపారు.

కంకవనం కనుమరుగు

- మేడారంలో తరిగిపోతున్న కంకవనాలు
- జాతర సమయంలో చెట్లను నరుకుతున్న వ్యాపారులు, భక్తులు
- నక్సెస్‌కాని ప్లాంటేషన్



ప్రస్తుతం కొంత కంకవనం కలిగిఉన్న చిలకలగుట్ట

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ప్రాంతంలో విస్తరించి ఉన్న కంకవనాలు కనుమరుగవుతున్నాయి. ప్రతీ రెండేళ్లకోసారి జరిగే మహాజాతరతో కంకవనాలది అవినాభావ సంబంధమనే చెప్పాలి. కన్నెపల్లి నుంచి సారలమ్మను, చిలకలగుట్ట నుంచి సమ్మక్కను కంక వెదురు బొంగులతో ప్రత్యేకంగా తయారు చేసిన బుట్టలో కుంకుమ భరిణి రూపంలో తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. అంతకు ముందు గుట్టపై పూజారులు కంకవనాన్ని ప్రత్యేకంగా పూజిస్తారు. ఇంతటి ప్రత్యేకత కలిగిన కంకవనాలు తరిగిపోతుండడంతో మేడారం జాతర ప్రాంతం బోసిపోయినట్లు కన్పిస్తుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. జాతర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు కంకవనాల పెంపుపై దృష్టి సారించాలని పూజారులు, భక్తులు కోరుతున్నారు.

సక్సెస్‌కాని ప్లాంటేషన్..

మేడారంలో ఒకప్పుడు ఏటు చూసినా కంకవనాలే దర్శనమిచ్చేవి. ప్రస్తుతం మేడారంలోని శివరాంసాగర్ చెరువు సమీపంలో తాడ్వాయి వెళ్లే మార్గంలో, చిలకలగుట్టపై మాత్రమే కంక వెదురు పోదలు కనిపిస్తున్నాయి. ప్రతి రెండేళ్లకోమారు జరిగే జాతరకు లక్షల సంఖ్యలో వచ్చిన భక్తుల్లో వేలాది మంది భక్తులు కంక వెదురు కొమ్మలను నరికి ఇంటికి తీసుకెళ్తున్నారు. జాతర సమయంలో వ్యాపారాల కోసం వెదురు బొంగులను నరికి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. జాతరలో భక్తులు వెదురు కర్రలతో గుడారాలను ఏర్పాటు చేస్తారు. ఇలా ప్రతీ అవసరానికి వెదురు చెట్లను నరికి ఆ కర్రను వినియోగిస్తుంటారు. దీంతో కంకవనాలు తరిగిపోతున్నాయి. అయితే కడియం శ్రీహరి ఉపముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో తాడ్వాయి మండలంలోని నార్లాపూర్ చింతల్ క్రాస్ వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో పది ఎకరాల్లో వెదురు మొక్కలతో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌లో సక్సెస్ కాలేదు. ప్రస్తుత మంత్రి సీతక్క ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మేడారంలో కంకవనాలను పెంచి పూర్వవైభవం తీసుకురావాలనే ప్రతిపాదనలను అధికారుల ముందుంచారు. కానీ, ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.



మేడారంలో కంకవనాలు

చెట్లుకూలిన ప్రదేశంలో కంకవనాలు..

మేడారం శివారులో గతేడాది ఆగస్టులో వర్ష బీభత్సం, పెనుగాలులకు కూలిన చెట్ల ప్రదేశాల్లో కంకవనాలు పెంచాలని పూజారులు, భక్తులు అభిప్రాయపడుతున్నారు. కూలిన చెట్ల ఖాళీ ప్రదేశంలో అడవుల పునర్నిర్మాణం కోసం చెట్ల పెంపకంతోపాటు ఎక్కువ మొత్తంలో కంకవనాలను పెంచితే వాతావరణ కాలుష్యాన్ని తగ్గించే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దేవాదాయశాఖ అధికారులు.. మంత్రులు సీతక్క, కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి కంక మొక్కలు నాటేందుకు చొరవ చూపాలని పూజారులు కోరుతున్నారు.

కంకవనాలే విడిది ప్రదేశాలు..

మేడారం సమ్మక్క- సారలమ్మ దర్శనానికి వచ్చే వచ్చే భక్తులు వంటావార్పుతోపాటు కాసేపు సేదదీరాలన్నా.. కంకవనాలను ఆశ్రయించాల్సిందే. ఆహ్లాదకరమైన కంకవనాల కింద వంటలు చేసుకుని కుటుంబ సమేతంగా భోజనాలు చేసి ఆనందంగా గడిపిన అనంతరం భక్తులు ఇంటిబాట పడుతుంటారు.

కంకవనాలు పెంచాలి



మేడారంలో కంకవనాలను పెంచేందుకు అధికారులు కృషి చేయాలి. కొన్నేళ్ల క్రితం మేడారం ప్రాంతంలో వందలాది ఎకరాల్లో కంకవనాలు విస్తరించి ఉండేవి. జాతరలో అమ్మవార్ల పూజా కార్యక్రమాల్లో కంకవనాలకు ప్రత్యేకత ఉంది. కంకవనాలు కనుమరుగువుతున్నాయని వాటి పెంపకం కోసం ప్రత్యేక కృషి చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మేడారంలో ఖాళీ ప్రదేశాలతోపాటు రోడ్లకు ఇరువైపులా కంకవనాలను పెంచితే బాగుంటుంది.

– జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

క్రీడలు మానసిక దృఢత్వానికి దోహదపడతాయి



మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు రూరల్: పోలీసులకు వ్యాయామం, క్రీడలు మానసిక దృఢత్వానికి దోహదపడతాయని ఎస్పీ శబరీశ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని జాకారం పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో జిల్లా స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌శాఖలో ఫిజికల్ ఫిట్నెస్ ఎంతో అవసరమని అన్నారు. క్రీడలు పోలీసుల్లో ఉత్తేజాన్ని నింపుతాయని, పోలీసులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని అన్నారు. ప్రజల సంరక్షణ పోలీసుల ప్రథమ కర్తవ్యమని దీంతోపాటు పోలీసులు ఆరోగ్యం ముఖ్యమని పేర్కొన్నారు. క్రీడలు నాలుగు రోజులపాటు నిర్వహిస్తామని ఈ నెల 06వ తేదీన ముగుస్తాయని వెల్లడించారు. జిల్లాలో మొత్తం ఆరు టీంలు.. క్రికెట్, వాలీబాల్, బ్యాట్మింటన్, చెస్, క్యారమ్, రన్నింగ్ విభాగాల్లో పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అడిషనల్ ఎస్పీ సదానందం, డీఎస్పీ, డీసీఆర్బీ కిషోర్ కుమార్, సీఎస్‌డీ డీఎస్పీ సందీప్‌రెడ్డి, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాజేడు పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్సై

- హరీశ్ ఆత్మహత్యతో ఖాళీ అయిన స్థానం
- విధుల్లో చేరిన ఎస్సై రాజ్‌కుమార్



వాజేడు: విధుల్లో చేరిన ఎస్సై రాజ్ కుమార్

వాజేడు: వాజేడు ఎస్సైగా రాజ్‌కుమార్ శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న రుద్రారపు హరీశ్ డిసెంబర్‌లో వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ పోలీస్ స్టేషన్ పరిధిని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు. ఈక్రమంలో ప్రస్తుతం మహదేవ్‌పూర్‌లో ఎస్సైగా పని చేస్తున్న రాజ్‌కుమార్‌ను ఉన్నతాధికారులు వాజేడుకు పంపించారు. దీంతో ఆయన వాజేడు స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకాలు



కాంస్య పతకాలు సాధించిన నవీన, సోనియా



ఏటూరునాగారం:సీఎం కప్‌లో పలు మెడల్స్ సాధించిన విద్యార్థులు

ములుగు/ములుగు రూరల్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో బాక్సింగ్ విభాగంలో ములుగు జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు కాంస్య పతకాలు సాధించినట్లు బాక్సింగ్ కోచ్ మామిడిపల్లి రమేశ్ తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో 50 కేజీల విభాగంలో నవీన, 46 కేజీల విభాగంలో సోనియా ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. కాగా, విద్యార్థులను ప్రిన్సిపాల్ నర్మదబాయి, వ్యాయామ ఉపాధ్యాయులు త్రివేణి, శ్రీలత, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

ఏటూరునాగారం: హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో కరాటే విభాగంలో ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కరాటే కోచ్ ఎండీ హుస్సేన్ తెలిపారు. చామర్తి ఐశ్వర్య సిల్వర్ మెడల్, బాదావత్ దినేశ్ –సిల్వర్, కందుకూరి శ్రీహరిణి –బ్రాంజ్, గూడూరి హర్షవర్ధన్ –బ్రాంజ్ మెడల్ సాధించారని కోచ్ తెలిపారు. విద్యార్థులను జిల్లా యువజన, క్రీడల అధికారి తులా రవి అభినందించారు.

ఇందిరా మహిళా శక్తితో మహిళల ఆర్థికాభివృద్ధి



చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మంజూరైన సంచార చేపల విక్రయ వాహనాలను మహిళా సంఘాల్లోని లబ్ధిదారులకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క.. ప్రజాభవన్‌లో శుక్రవారం అందించారు. జిల్లాలోని ఇంచర్ల గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు బయ్య మల్లమ్మకు చేపల విక్రయ వాహనం కేటాయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మత్స ం ద్వారా రూ.10 లక్షల యూనిట్‌ను 60శాతం సబ్సిడీతో అందించినట్లు తెలిపారు. మహిళా సంఘం సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆర్థికంగా వృద్ధి చెందాలన్నారు.

7న మెగా జాబ్‌మేళా

- ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ సంపత్‌రావు
- 50కంపెనీల ఆధ్వర్యంలో 15వేల ఉద్యోగాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంపత్ రావు

గోవిందరావుపేట: జిల్లాలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 7వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన ఈజీఎంఎం అధికారులతో జాబ్ మేళా నిర్వహించే గార్డెన్‌ను అదనపు కలెక్టర్ సంపత్ రావు ఆయన పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఈజీఎంఎం ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ మార్కెటింగ్ మిషన్ ద్వారా మండలంలోని చల్వాయి శివారులోని పీఎస్ఆర్ గార్డెన్‌లో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ మంత్రి సీతక్క ప్రారంభిస్తారని అన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన యువతీయువకులు మేళాలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ జాబ్ మేళాలో 50 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా కంపెనీలు శిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా 15,000 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. డీపీఎం సతీశ్, ఎంపీఓ శరత్ కుమార్, చల్వాయి కార్యదర్శి భారతి, ఏటీఎం నాగేశ్వరరావు, సీసీలు రజియా, సుభాషిని, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల సందర్శన

- ఉచిత సేవలపై ఆరా తీసిన ఐటీడీఏ అధికారులు



ఆరోగ్యశ్రీ సేవలపై ఆరా తీస్తున్న ఐటీడీఏ అధికారులు

ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగులకు అనారోగ్య సమస్యలు వస్తే పంపించే ఆరోగ్య శ్రీ కలిగిన ఆస్పత్రులను సందర్శించినట్లు ఐటీడీఏ ఎస్‌ఓ సురేశ్‌బాబు, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్ తెలిపారు. ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు శుక్రవారం వరంగల్ జిల్లాలో ఆరోగ్య శ్రీ కలిగిన సంరక్ష, శ్రీనివాస కిడ్నీ సెంటర్, అజరా, గార్డియన్, ప్రతిమ, రోహిణి, ఎస్ఎస్ఆర్, రిలీఫ్, రెడ్ క్రాస్ తదితర హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతున్నాయి.. పేషెంట్స్‌కు వసతులు ఉచితంగా అందుతున్నాయా.. అని తెలుసుకున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పేషెంట్స్‌కు, పేమెంట్ పేషెంట్స్‌కు తేడాను పరిశీలించామని అన్నారు. ఆర్థోపెడిక్, న్యూరాలజీ, యురాలజీ కార్డియాలజీ, పాల్మనాలజీ, పాలిట్రామా తదితర కేసులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ మేనేజర్ మహేందర్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ పమ్మి విక్రమ్, టీం లీడర్ సుమన్, ఆరోగ్యమిత్ర కొండా రమేశ్ పాల్గొన్నారు.

మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి

- కలెక్టరేట్‌లో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



ఉత్తమ మహిళా ఉపాధ్యాయులతో కలెక్టర్ దివాకర టీఎస్, అధికారులు

ములుగు: మహనీయుల స్ఫూర్తి, ఆశయాల స్ఫూర్తిగా పనిచేయాలని కలెక్టర్ దివాకర టీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు, మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన ఆనాటి సమాజంలో తన భర్త జ్యోతిరావుపూలే ప్రోత్సాహంతో చదువునేర్చుకొని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తుచేశారు. ఆరోజుల్లో బాలికల పాఠశాలను ప్రారంభించిన గొప్పతనం ఆమెకే దక్కుతుందన్నారు. కులవివక్షత వంటి రుగ్మతలను రూపుమాపేందుకు పూలే దంపతులు చేసిన పోరాటం, చూపిన తెగువ ఆదర్శనీయమని అన్నారు. సామాజిక కట్టుబాట్లు అవాంతరాలు ఎదురైనా పట్టుదలతో చదువును కొనసాగించిన ధీశాలి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆమె సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం జనవరి 03వ తేదీని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు.ఈ సందర్భంగా నీరజ, జ్యోతి, మమత, రాధిక, భాగ్యలక్ష్మి, జయశ్రీ,రాణి, పద్మ, రమాదేవి, పర్వతాల రమాదేవి, మాధురిదేవి, మధురిమ, సునీత, లక్ష్మి, పద్మావతి, రిజ్వానా కౌసర్‌బేగం, సమ్మక్క, సుమలతదేవిలను ఉత్తమ మహిళా ఉపాధ్యాయినిలుగా ఎంపిక చేసి సన్మానించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ కార్యదర్శి సూర్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, సమగ్రశిక్ష కో ఆర్డినేటర్ అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, సాంబయ్య, రమాదేవి, ఎంఈఓలు శ్రీనివాసులు, కేశవరావు, మల్లయ్య, మేనక, వెంకటేశ్వర్లు, శిరుప సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

యువత సద్వినియోగం చేసుకోవాలి



పాండవుల గుట్టలను పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ

రేగొండ: పాండవుల గుట్టల్లో రాక్‌క్లైంబింగ్ చేయడానికి యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని జిల్లా ఫారెస్ట్ అధికారి నవీన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పాండవుల గుట్టలను శుక్రవారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాండవుల గుట్టలు రాక్‌క్లైంబింగ్, రాపెల్లింగ్, ట్రెక్కింగ్‌కు చాలా అనుకూలంగా ఉంటాయన్నారు. పర్యాటక ప్రాంతమైన పాండవుల గుట్టలను పర్యాటకులు కుటుంబ సమేతంగా సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించాలని కోరారు. ఆయన వెంట ఫారెస్ట్ రిజర్వ్ ఆఫీసర్ నరేష్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ గౌతమి ఉన్నారు.

వంతెనపై భారీ వాహనాలను అనుమతించం



బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎస్ఈ వెంకటేశ్వరరావు



బ్రిడ్జి కుంగిపోవడంతో నిలిచిన లారీలు

- కుంగిన రాళ్లవాగు వంతెనను పరిశీలించిన ఆర్అండ్‌బీ ఎస్ఈ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని యాకన్నగూడెం గ్రామ సమీపంలో గురువారం రాత్రి కుంగిపోయిన రాళ్లవాగు వంతెనపై నుంచి భారీ వాహనాలకు అనుమతి లేదని ఆర్అండ్‌బీ ఎస్ఈ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన వంతెన కుంగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వంతెన కిందకు దిగి వంతెన ఎంత మేరకు కుంగిపోందని పరిశీలించారు. బ్రిడ్జి ఎంతమేర దెబ్బతిన్నది అనే విషయాలను కొలతలు వేసి నివేదికను తయారు చేశారు. ఈ వంతెనపై నుంచి బారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. ఈ రహదారిపై ద్విచక్రవాహనాలు, కార్లను ప్రస్తుతానికి వెళ్లే విధంగా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టారు. వంతెన సమీపంలో ఆర్అండ్‌బీ సిబ్బందికి డ్యూటీలను వేసి బారీ వాహనాలు వెళ్లకుండా కట్టుదిట్టం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి సగభాగం మేరకు దెబ్బదిన్నట్లు గుర్తించారు. దెబ్బతిన్నవరకు బ్రిడ్జిని తొలగించి రెండు మూడు నెలల్లో మరమ్మతులు చేస్తామని తెలిపారు. బ్రిడ్జి మరమ్మతు కోసం నివేదిక తయారు చేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు పంపిస్తామని అన్నారు. కాగా, రాళ్లవాగు బ్రిడ్జి కుంగిపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని ఇసుక రీచ్‌కు వెళ్లాల్సిన లారీలు భారీ సంఖ్యలో బ్రిడ్జి వద్ద నిలిచిపోయాయి.

సింగరేణి సంస్థలో జేఈఓలకు పోస్టింగ్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా ఇటీవల ఆరుగురు జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ల (జేఈఓ)లను నియమించారు. గ్రేడ్–1 ఉద్యోగులైన వీరికి వివిధ ఏరియాల్లో పోస్టింగ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఇందులో వాసం దీపక్‌ను భూపాలపల్లి జేఈఓగా, నేరెళ్ల మహేష్‌గౌడ్‌ను శ్రీరాంపూర్ ఏరియాకు, మారేడు మధుమితను కొత్తగూడెం ఏరియాకు, నేరెళ్ల నీరేష్‌గౌడ్‌ను ఆర్జీ–1 ఏరియాకు, భూక్యా రజనీకాంత్‌ను బెల్లంపల్లికి, ఆసిఫ్ మహ్మద్‌ను మందమర్రి ఏరియా జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్‌గా కేటాయించారు.

క్లుప్తంగా

ఓసీ -3 ప్రాజెక్టులో రోడ్డు ప్రమాదం

- డ్రైవర్ అన్వర్‌కు తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం



క్యాబిన్‌లో ఇరుక్కు పోయిన అన్వర్‌పాషా

గణపురం: భూపాలపల్లి జిల్లా గణపురం మండలం మాధవరావుపల్లి ఓసీ -3 ప్రాజెక్టులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వోల్వో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ప్రాజెక్టులో బొగ్గును తరలిస్తున్న క్రమంలో మంచు కురుస్తుండడంతో ర్యాంప్‌పై నిలిపిన వాహనాన్ని మరో వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. దాంతో ఈ ప్రమాదంలో గణపురం మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ అన్వర్ పాషాకు తీవ్ర గాయాలయ్యాయి. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో గమనించిన తోటి డ్రైవర్లు, సిబ్బంది వెంటనే భూపాలపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, అతడి కాలును పూర్తిగా తొలగించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

పత్తి కట్టెను కలియదున్నాలి

- వాటిని కాల్చితే కాలుష్యం
- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న



సింగారంలో పత్తి పంటను యంత్రం ద్వారా ముక్కలుగా కట్‌చేసి దున్నే విధానాన్ని పరిశీలిస్తున్న రాజన్న, తదితరులు

మామునూరు: పత్తి కట్టెను యంత్రంతో ముక్కలుగా చేసి భూమిలోనే కలియ దున్నడం వల్ల సేంద్రియ ఎరువుగా కూడా ఉపయోగపడుతుందని వరంగల్ మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న సూచించారు. ఈమేరకు వరంగల్ బొల్లికుంట, మామునూరు, సింగారం గ్రామాల్లో కేవీకే శాస్త్రవేత్తలు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎండిపోయిన పత్తి పంటలను పరిశీలించి మాట్లాడారు. రూ.లక్ష యాభై వేలకు కాటన్ షెడ్డర్ యంత్రం మార్కెట్లో లభిస్తుందని చెప్పారు. దానితో గంటన్నరలో ఎకరం విస్తీర్ణంలోని పత్తి కర్రను ముక్కలుగా చేసి కలియ దున్నవచ్చని చెప్పారు. పత్తి కర్రలను కాల్చడం వల్ల కాలుష్యం పెరిగి భూమి దెబ్బతింటుందని హెచ్చరించారు. అలాగే, పత్తి కర్ర తీయకపోవడం వల్ల వచ్చే అనర్థాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, రాజు, హర్షరెడ్డి, సాయిచంద్, సుశృత్, రైతులు పాల్గొన్నారు.



రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడాలి

దేశ సేవలో స్పెషల్ పోలీసులు ముందుండాలి | **సమాజాన్ని తీర్చిదిద్దడంలో పోలీసుల పాత్ర కీలకం**

- పాసింగ్ అవుట్ పరేడ్‌లో రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్, ఐజీ డాక్టర్ తరుణ్‌జోషి
- ఆకట్టుకున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్



మాట్లాడుతున్న తరుణ్‌జోషి



ప్రత్యేక వాహనంపై వెళ్తూ కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న తరుణ్‌జోషి

ఖిలా వరంగల్: శాంతిభద్రతల పర్యవేక్షణ బాధ్యత స్పెషల్ పోలీసులపై ఉందని రాష్ట్ర ఏసీబీ డైరెక్టర్, ఐజీ డాక్టర్ తరుణ్‌జోషి గుర్తుచేశారు. సమాజాన్ని తీర్చిదిద్దడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో కమాండెంట్ బి.రాంప్రకాశ్ ఆధ్వర్యంలో ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 453 మంది స్పెషల్ కానిస్టేబుళ్ల దీక్షాంత్ (పాసింగ్ అవుట్) పరేడ్ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. ముఖ్యఅతిథిగా తరుణ్‌జోషి హాజరై పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, కమాండెంట్ రాంప్రకాశ్‌లతో కలిసి ప్రత్యేక వాహనంపై నుంచి స్పెషల్ కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను ఉద్దేశించి తరుణ్‌జోషి మాట్లాడారు. పోలీసు కుటుంబంలో చేరబోతున్న ప్రతీ కానిస్టేబుల్ ప్రజా సేవకుడిగా మారాలని సూచించారు. యూనిఫాంను గౌరవిస్తూ ప్రజల కష్టాలు, నష్టాలను అంచనా వేస్తూ వారి సేవలో ముందుండాలన్నారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తూ చట్ట ప్రకారం శిక్షించాలని పేర్కొన్నారు. నేరాలను అదుపు చేయడంలో అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కిందిస్థాయి నుంచి అత్యున్నత స్థాయి వరకు ఏఒక్కరూ తప్పు చేసినా పోలీసు శాఖపై మచ్చ పడుతుందని తెలిపారు. క్రమశిక్షణ, వృత్తి పట్ల నిబద్ధతతో విధులు నిర్వర్తించే వారికి పోలీసు శాఖలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని వివరించారు. లక్ష్యసాధన కోసం 9నెలల పాటు కఠోర శిక్షణను ఇష్టంగా పూర్తిచేసి వందశాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని ప్రశంసించారు. కార్యక్రమంలో పరేడ్ వ్యాఖ్యాత, ఫార్మసిస్ట్ జలగం రమేష్‌కుమార్, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్, ఏసీలు శ్రీనివాస్‌రావు, వీరన్న, ఆర్‌ఐలు శోభన్, రవి, వెంకటేశ్వర్లు, సర్వర్, పురుషోత్తం రెడ్డి, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



భార్య, పిల్లలతో కానిస్టేబుల్

మెరుగైన సేవలందించాలి

కానిస్టేబుళ్లు అధునాతన టెక్నాలజీని ఉపయోగించి దేశం గర్వించే విధంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ కమాండెంట్ బి.రాంప్రకాశ్ సూచించారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతీ అంశం విధి నిర్వహణలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తొమ్మిది నెలల పాటు ఇండోర్, అవుట్ డోర్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యేక శిక్షణ తరగతులను శిక్షణార్థులు విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు.



తల్లిదండ్రుల కాళ్లు మొక్కుతున్న కానిస్టేబుల్

శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల మనోగతం

మా నాన్నే నాకు ఆదర్శం



మా నాన్న హైదరాబాద్‌లో వ్యాపారం చేస్తుంటాడు. మా తల్లిదండ్రులు కష్టపడి నన్ను చదివించారు. మా నాన్నను ఆదర్శంగా తీసుకునే ఎలాగైనా జాబ్ సాధించాలనుకున్నాను. ఆయన ఆశయం నెరవేర్చినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది.

– పి.పాండు, రాయ్‌కోడ్, సంగారెడ్డి జిల్లా

నిబద్ధతతో పనిచేస్తా..



నాకు జాబ్ రావడంతో మా కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. మాది వ్యవసాయ ఆధారిత కుటుంబం. మా తల్లిదండ్రుల కష్టాలు తీర్చడానికి కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించాను. వృత్తి పట్ల నిబద్ధతతో పనిచేయడమే నా లక్ష్యం.

– వై.శ్రీనివాస్, కల్వకుర్తి, నాగర్ కర్నూల్ జిల్లా

నా జీవితంలో మరువలేని ఘట్టం



టీజీఎస్పీ బెటాలియన్‌లో స్పెషల్ కానిస్టేబుల్‌గా శిక్షణ పొందడం నా జీవితంలో మరిచిపోలేని ఘట్టం. రైతు కుటుంబంలో పుట్టిన నేను.. నా కుటుంబ పోషణ కోసం ఎలాగైనా కానిస్టేబుల్ జాబ్ కొట్టాలనుకున్నాను. కష్టపడి సాధించి శిక్షణ పూర్తిచేశాను. ఇప్పుడు నా కుటుంబ సభ్యులు ఎంతో ఆనందంగా ఉన్నారు.

– ఉదయ్‌కిరణ్, ఉట్కూర్, నారాయణపేట జిల్లా





మామునూరు టీజీఎస్పీ 4వ బెటాలియన్‌లో నిర్వహించిన దీక్షాంత్ పరేడ్‌లో కానిస్టేబుళ్ల విన్యాసాలు



కానిస్టేబుల్‌కు బహుమతి అందజేస్తున్న తరుణ్‌జోషి

ఎస్ఎస్ఈ రాజమౌళికి విశిష్టసేవా పురస్కార్



అవార్డు అందుకుంటున్న రాజమౌళి

కేసముద్రం: సికింద్రాబాద్ రైల్ కళారంగ్‌లో మహబూబాబాద్ సెక్షన్ సీనియర్ ఇంజనీర్ (ఎస్ఎస్ఈ) రాజమౌళికి విశిష్ట సేవా పురస్కార్ అవార్డు దక్కింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదల కారణంగా మహబూబాబాద్ సెక్షన్‌లోని మహబూబాబాద్ – తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య, ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో 20చోట్ల రైల్వే ట్రాక్ కింద కంకర కొట్టుకుపోయిన సమయంలో సెక్షన్ సీనియర్ ఇంజనీర్ రాజమౌళి ముందస్తుగా పెట్రోల్ మెన్, బ్రిడ్జి వాచ్‌మెన్‌లను అప్రమత్తం చేసి ఎలాంటి ప్రమాదం జరగకుండా విధులు నిర్వహించారు. రైల్వేలోని ఇంజనీరింగ్ విభాగంలో రాజమౌళి చేసిన సేవలను గుర్తించి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ చేతుల మీదుగా విశిష్ట సేవా పురస్కార్ అవార్డును ఆయనకు శుక్రవారం అందజేశారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్‌కు కేయూ హాకీ జట్టు



కేయూ హాకీ జట్టుతో వెంకయ్య

కేయూ క్యాంపస్: చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో ఈనెల 3న ప్రారంభమై 7వ తేదీ వరకు కొనసాగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ హాకీ పురుషుల జట్టు ఎంపికైందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శుక్రవారం తెలిపారు. ఈ జట్టులో జి.ప్రవీణ్, బి.సింహాద్రి, బి.వరుణ్ తేజ్, బి.అఖిల్, జి.రాజు, ఎస్.రామకృష్ణ, జి.తేజ, పి.శ్రీకాంత్, ఎ.నగేష్, కె.రాజ్‌కుమార్, ఇ.వాసుదేవ్, ఎస్.చిరంజీవి, కె.జంగు, ఎస్.విజయ్‌కుమార్, ఎస్.గౌతమ్ రాజ్, పి.సందీప్, బి.గోపిచంద్, మహ్మద్ ఉస్మాన్ ఘనీఖాన్ ఉన్నారు. ఈ జట్టుకు వరంగల్‌లోని బొల్లికుంట వీసీపీఈ ఫిజికల్ డైరెక్టర్ సయ్యద్ యాసిన్, హనుమకొండ కాకతీయ ప్రభుత్వ, కనిష్క డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రాకేష్ కోచ్‌గా వ్యవహరించనున్నట్లు ప్రొఫెసర్ వెంకయ్య వివరించారు.

కడియం శ్రీహరి పొద్దు తిరుగుడు పువ్వు

- ఏ పార్టీ అధికారంలో ఉంటే అక్కడికి వెళ్తాడు
- సిగ్గుంటే రాజీనామా చేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: రాష్ట్ర రాజకీయాల్లో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పొద్దు తిరుగుడు పువ్వులా మారిపోయారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో పల్లా మాట్లాడుతూ రంగులు మార్చే ఊసరవెల్లి కడియంకు గోరీ కడతామని హెచ్చరించారు. ఏపార్టీ అధికారంలో ఉంటే అందులోకి పదవి పిచ్చితో మారే శ్రీహరికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఏమాత్రం సిగ్గూ, శరం ఉన్నా కేసీఆర్ పెట్టిన భిక్షతో ఎన్నికైన పదవికి వెంటనే రాజీనామా చేసి, తిరిగి పోటీ చేసి తన సత్తాను నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. కేసీఆర్, కేటీఆర్, కవితను విమర్శించే స్థాయి కాదని ఘాటుగా విమర్శించారు. ఇష్టం వచ్చినట్లు అవాక్కులు, చెవాక్కులు పలికితే కర్రుకాల్చి వాత పెడతామని శ్రీహరిని పల్లా హెచ్చరించారు. తన వ్యక్తిగతంగా వైద్యం విషయంలో నీలిమ ఆస్పత్రి ద్వారా వందలాది మందికి ఉచితంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. 40 ఏళ్ల రాజకీయం అంటున్న కడియం శ్రీహరి.. ఘన్‌పూర్‌కు ఒక్క డిగ్రీ కళాశాల కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, నర్సింగరావు, మసిఉర్ రెహమాన్, గంగం సతీష్‌రెడ్డి, ముస్త్యాల దయాకర్, జూకంటి లక్ష్మి శ్రీశైలం, పేర్ని స్వరూప, బోడిగం జయప్రకాష్‌రెడ్డి, ముసిని రాజు, వేముల విద్యాసాగర్ గౌడ్, దేవునూరి సతీష్, తదితరులు ఉన్నారు.

టీపీజేఎంఏ క్రీడా పోటీలు ప్రారంభం



వరదారెడ్డిని సన్మానిస్తున్న టీపీజేఎంఏ సభ్యులు

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీ మైదానంలో తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీజేఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగనున్నాయి. టీపీజేఎంఏ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్, హనుమకొండ డీఐఈఓలు శ్రీధర్ సుమన్, గోపాల్ ముఖ్యఅతిథులుగా హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం చేకూరుతోందన్నారు. పోటీల వల్ల స్నేహభావం పెంపొందుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఎస్సార్ యూనివర్సిటీ చైర్మన్ ఎ.వరదారెడ్డిని టీపీజేఎంఏ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుపతిరెడ్డి, సంఘం సభ్యులు కుమార్, రాజు, అశోక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు అస్వస్థత

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని వైరల్
- ఫుడ్ పాయిజన్ అంటున్న భర్త వెంకటాచారి



వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నల్లనాగుల శ్వేత

బచ్చన్నపేట : సిద్దిపేట జిల్లా చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన నల్లనాగుల శ్వేత శుక్రవారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా శ్వేత కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుందంటూ ఉదయం పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఇందుకు కుటుంబ కలహాలే కారణమని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై చైర్ పర్సన్ శ్వేత భర్త వెంకటాచారి ఆస్పత్రినుంచి వీడియో పంపారు. తన భార్యకు ఫుడ్‌పాయిజన్ అయి తీవ్ర అస్వస్థతకు గురైందని, జనగామ ఆస్పత్రినుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లామని పేర్కొన్నారు. తమపై అభూత కల్పనలతో దుష్ప్రచారాలు చేయడం తగదంటూ వేడుకున్నారు. త్వరలోనే శ్వేతతో మాట్లాడిస్తామని వెల్లడించారు. ఈ విషయమై ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ వివరణ కోరగా శ్వేత ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేసుకున్నదనే వార్త వాస్తవం కాదన్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

- తిరుపతికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల
- 4.8 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ.35 వేల నగదు అపహరణ

గీసుకొండ: వరంగల్ జిల్లా సంగెం మండల శివారు స్టేషన్ చింతలపల్లికి చెందిన జవ్వాజి హేమలత తన కుటుంబ సభ్యులతో కలిసి గత డిసెంబర్ 30న ఇంటికి తాళం వేసి తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. స్వామివారి దర్శనం అనంతరం శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గమనించి గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటిలోని 4.8 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి, రూ.35 వేల నగదు, ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

ఇంటికి తిరిగి వచ్చేలోగా ఊడ్చేశారు!

- రూ.4.80 లక్షల నగదు, 20 తులాల బంగారం చోరీ

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం విజయనగర్ నగర్‌కాలనీకి చెందిన సయ్యద్ ఖాజా ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో సుమారు రూ.4.80 లక్షల నగదు, 20 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. సయ్యద్ ఖాజా నాలుగురోజుల క్రితం నయీంనగర్‌లో తనకున్న మరో ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి శుక్రవారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి, బీరువా ధ్వంసమై ఉంది. రూ.4.80 లక్షలతో పాటు బంగారు ఆభరణాలు కనిపించలేదు. సమాచారం అందుకున్న ఎస్సై రవీందర్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వేలిముద్రలు సేకరించి పోలీసు జాగిలాలతో గాలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ House for sale 164 sq.yards west face near Releif Hospital Arepally, Warangal 69 Lakhs Loan are available. Cont: 9652715142. [W-1264164]

SERVICES

FINANCIAL SERVICES

■ సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర॥ 9440863470. [W-1264166]

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9177555694. [SCA25001023]

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం తక్కువ వడ్డీ రేటు, సిబిల్ అవసరం లేదు, NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సలహాలకు సంప్రదించండి: 7297898678. [T-293]

LOANS

■ ప్లాటు, పెంకుటిల్లు, రేకుల కప్పు, టేకోవర్ లోన్స్, అన్ని రకాల వ్యాపారులకు, పర్సనల్ లోన్స్, భవన నిర్మాణ కార్మికులకు Topup లోన్స్, సిబిల్ లేకున్న, సిబిల్ బ్యాడ్ వున్న లోన్స్ ఇవ్వబడును. 62816 93271. [M-0983555]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

WANTED

■ Office Executive Part / Full time (Male / Female), SBI Bank Opp. Under Bridge Road, WGL. SBI Customer Service Point. Cell: 7981380146. [W-1264174]

■ హరేకృష్ణ హోం కేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640468899, 9640258899 [SCA25001049]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256025]

మీ చిన్నారి పుట్టినరోజు శుభాకాంక్షలను ఇప్పుడు సాక్షి ద్వారా తెలియజేయండి కేవలం రూ.500/- మాత్రమే

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

- మొక్కజొన్న చేనుకు నీరుపెడుతుండగా ప్రమాదం



ప్రమాద స్థలంలో సుగుణ మృతదేహం

దుగ్గొండి: ఐదేళ్ల క్రితం తన భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో ముగ్గురు పిల్లల పోషణ భారం మీద పడడంతో భర్త మరణాన్ని దిగమింగుకుని కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మహిళా రైతును విద్యుదాఘాతం రూపంలో మృత్యువు కబళించింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం రేబల్లె గ్రామానికి చెందిన గుగులోతు సుగుణ (50) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. భర్త స్వామి ఐదేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటి నుంచి అన్నీ తానై కుటుంబ భారం మోస్తోంది. తన వ్యవసాయ భూమి వద్ద వానాకాలం పత్తి పంట వేసి కలిసి రాకపోవడంతో దాన్ని తొలగించి రెండోపంట మొక్కజొన్న సాగు చేసింది. మొక్కజొన్న చేనుకు నీరు పెట్టడానికి శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లింది. మోటారు ఆన్‌చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రాత్రి అవుతున్నా తల్లి ఇంటికి రాకపోవడంతో పెద్ద కొడుకు అనిల్ బావివద్దకు వెళ్లి చూడగా అప్పటికే ఆమె విగతజీవిగా పడిఉంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతం అయ్యారు. మృతురాలికి కుమారులు అనిల్, రాజేందర్, కూతురు జమున ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు పరిశీలించారు. మృతురాలి కుమారుడు అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హాస్టల్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న విద్యార్థి రామ్‌చరణ్

కాటారం: భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతున్న గుండపు రామ్‌చరణ్ శుక్రవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హాస్టల్ వార్డెన్ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థి రామ్‌చరణ్ 15 రోజుల క్రితం ఇంటికి వెళ్లి శుక్రవారం ఉదయం తిరిగి హాస్టల్‌కు వచ్చాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండడంతో పాఠశాలకు వెళ్లాలని వార్డెన్ అతనికి సూచించారు. అనంతరం పాఠశాలకు వెళ్లిన రామ్‌చరణ్.. పురుగుల మందు తాగినట్లు స్థానిక పీహెచ్‌సీ నుంచి రెండు గంటల తర్వాత తనకు సమాచారం అందినట్లు వార్డెన్ తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. తన తండ్రితో గొడవ జరగడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగినట్లు సదరు విద్యార్థి చెప్పినట్లు వైద్యుడు సందీప్ తెలిపారు. కాగా, ఆ విద్యార్థికి పురుగుల మందు డబ్బా ఎక్కడినుంచి వచ్చిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం రామ్‌చరణ్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.

చిన్న కాళేశ్వరం మోటార్ల టెస్ట్ రన్ ప్రారంభం



మహదేవపూర్‌లో ఎర్రచెరువును పరిశీలిస్తున్న నీటి పారుదల అధికారులు

కాళేశ్వరం: జయశంకర్ జిల్లా మహదేవపూర్ మండలం మెట్‌పల్లి పంచాయతీ పరిధి బీరాసాగర్ వద్ద నిర్మిస్తున్న చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా పంపుహౌస్‌లో మోటార్ల టెస్ట్ రన్‌ను ఇరిగేషన్ అధికారులు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా కాటారం మండలంలోని గూడూరు పెద్ద చెరువు, మహదేవపూర్ మండలంలోని ఎర్రచెరువులను పరిశీలించారు. సీఈ సుధాకర్ రెడ్డితో కలిసి పంపుహౌస్‌లోని మోటార్ల టెస్ట్ రన్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ సలహాదారు పెంటారెడ్డి నిర్వహించారు. మోటార్లకు విద్యుత్ సరఫరా అందుతోందా, మోటార్లలో ఏమైన ఎలక్ట్రికల్ సమస్యలు ఉన్నాయా, లో ఓల్టేజీ సమస్యలు తలెత్తే అవకాశం ఉందా అనే కోణంలో పరిశీలించారు. నిత్యం దశలవారీగా టెస్ట్ రన్‌లు చేసి డ్రై రన్ నిర్వహించనున్నట్లు తెలిసింది. వారి వెంట ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్ రెడ్డి, ఈఈ యాదగిరి పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టర్ బంగ్లా పరిశీలన



బంగ్లాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, అధికారులు

హన్మకొండ అర్బన్: నగరంలోని సుబేదారిలో గల పాత కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలను ఎమ్మెల్యే, అధికారులు పరిశీలించారు. పాత కలెక్టర్ క్యాంప్ కార్యాలయ భవనాన్ని మరమ్మతు పనులు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఉన్న అవకాశాలను అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే వెంట 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.